# సమాజ వికాస్ ప్రయోగం

స్థానిక ప్రభుత్వాలు రెండు విధాలు – 1. గ్రామీణ స్థానిక ప్రభుత్వం, 2. పట్టణ స్థానిక ప్రభుత్వం. గ్రామీణ స్థానిక ప్రభుత్వాన్ని రెండు భాగాలుగా విభజించవచ్చు. 1. స్వాతంత్ర్య పూర్వపు స్థానిక ప్రభుత్వం, 2. స్వాతంత్ర్యం తర్వాత స్థానిక ప్రభుత్వం. స్వాతంత్ర్య పూర్వం స్థానిక ప్రభుత్వాన్ని మూడు విధాలుగా చెప్పొచ్చు – 1. ప్రాచీన యుగం, 2. మధ్య యుగం, 3. ఆధునిక యుగం.

ప్రాచీన యుగంలో గ్రామవ్యవస్థ పంచాయత్‌తో అభివృద్ధి చెందింది. పంచాయత్ అనేది పాంచ్, ఆయత్ అనే రెండు పదాల కలయిక. పాంచ్ అంటే ఐదుగురు ఆయత్ అంటే ప్రజలు. ఐదుగురితో పాలించడం అని అర్థం. వేదకాలంలో గ్రామవ్యవస్థ రెండు భాగాలుగా ఉండేది. అవి ఘోష, గ్రామ. గ్రామం కంటే చిన్న వ్యవస్థ ఘోష. అధికారులు, పంచాయత్ సభ్యుల ద్వారా పాలన జరిగేది. గ్రామీణి (కరణం) అనే అధికారిని రాజు నియమించేవాడు. మౌర్యుల కాలంలో గ్రామ వృద్ధను రాజు నియమించేవాడు.

మధ్యయుగం కాలంలో భారతదేశాన్ని ముస్లిం రాజులు, మహారాష్ట్రులు పాలించారు. ముస్లిం కాలంలో పంచాయత్ వ్యవస్థ అభివృద్ధి చెందలేదు. మహారాష్ట్రుల కాలంలో శివాజీ పంచాయత్ వ్యవస్థను పునరుద్ధరించారు. ఆధునిక కాలంలో కొంతమేర గ్రామంలో పంచాయిత్ వ్యవస్థ మెరుగుపడింది. 1870 సంవత్సరంలో లార్డ్ మేయో స్థానిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాడు. అందువల్లనే ఆయన స్థానిక ప్రభుత్వ పితామహుడుగా పేరొందాడు.

## మేయో సిఫార్సులు

- ఆరోగ్యం, విద్య, జైలు, రిజిస్ట్రేషన్, పోలీస్, రోడ్లు మొదలైనవి కేంద్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలి.
- రాష్ట్రాలకు గ్రాంట్స్–ఇన్–ఎయిడ్ ఇవ్వాలి.
- అధికారులు–రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం ఉండాలి. పాలనలో మంచి అభివృద్ధిని పెంపొందించాలి.
- స్థానికుల ప్రోత్సాహం, పర్యవేక్షణ, జాగరూకత ఉండాలి.
- విద్య, ఆరోగ్యం స్థానిక పనులను నిర్వహించటంలో నిధులు అవసరం.

ఈ తీర్మానం వల్ల సెంట్రల్ ప్రావిన్స్‌లోను, నార్త్ వెస్ట్ ఫ్రాంటీరీయన్ ప్రావిన్స్‌లోను ఎన్నికలు జరిగాయి. పన్నులను విధించటం, వసూలు చేయటం కష్టతరమైంది. బొంబాయిలో లోకల్ ఫండ్ చట్టం ఏర్పాటైంది.

## రిప్పన్ సిఫార్సులు..

లార్డ్ రిప్పన్ 1882, మే 18న స్వపరిపాలనను అభివృద్ధి చేయడానికి కొన్ని సిఫార్సులు చేశాడు.

- స్థానిక బోర్డులను దేశమంతటా విస్తరించాలి. బోర్డుల పరిధి చిన్నదిగా ఉండాలి.
- అనధికారుల సంఖ్య ఎక్కువగా ఉండాలి. అధికారులు 1/3 వంతు కంటే ఎక్కువగా ఉండరాదు.
- స్థానిక బోర్డు సభ్యులకు ఎన్నికలు జరపాలి.
- బోర్డులకు వనరుల నిర్వహణలో ప్రాధాన్యం కల్పించాలి.
- స్థానిక పనులను పర్యవేక్షించడానికి, బిల్డింగ్‌లను నిర్మించడానికి, నిర్వహించడానికి జిల్లా ఇంజినీర్ ఉండాలి.
- చైర్మన్ అధ్యక్షుడిగా ఉండాలి.
- అనధికారులకు పత్రాలుండాలి.
- స్థానిక సంస్థలపై పర్యవేక్షణ, నియంత్రణ ఉండాలి.
- స్థానిక సంస్థలలో ఎన్నిక విధానం ఉండాలి.

స్థానిక వ్యవస్థలు 1882–1905 మధ్యకాలంలో పెద్దగా అభివృద్ధికి నోచుకోలేదు. స్థానిక బోర్డులు జిల్లా అధికారుల నియంత్రణలో ఉండటం, అనధికారుల ప్రోత్సాహం అంతగా లేకపోవటం, ఆర్థిక సమస్యలను ఎదుర్కోవటంలో సమస్యలు ఏర్పడటం మొదలైన కారణాల వల్ల అభివృద్ధి చెందలేదు.

## అధికార వికేంద్రీకరణ..

1907లో బ్రిటిష్ ప్రభుత్వం లార్డ్ హార్డింగ్ కాలంలో గ్రామ వ్యవస్థను అభివృద్ధిపరచటానికి రాయల్ కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్‌కు అధ్యక్షుడు చార్లెస్ హాబ్ హౌజ్. ఈ కమిషన్ 1909లో తన నివేదికను సమర్పించింది. జనాభాను బట్టి మున్సిపాలిటీల ఏర్పాటు, అధికార వికేంద్రీకరణ ఇందులోని ప్రధాన అంశాలు. ఈ కాలంలోనూ పంచాయత్ సంస్థలు అంతగా మెరుగుపడలేదు. 1915లో భారత ప్రభుత్వ తీర్మానం ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచటానికి సిఫార్సులు చేసింది. కానీ వాటివల్ల కూడా అంతగా ఫలితం లేకపోయింది. 1918లో గ్రామాభివృద్ధి కోసం మరొక తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. ఆ తీర్మానం సిఫార్సులు...

- పంచాయితీలను పునరుద్ధరించాలి.
- స్థానిక సంస్థలలో ఎన్నికైన అనధికారులకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- స్థానిక సంస్థలకు ఎన్నికలను నిర్వహించాలి.
- ప్రెసిడెంట్‌ను ప్రజలే ఎన్నుకోవాలి.
- స్థానిక సంస్థలకు పన్నులను విధించే అధికారముండాలి.
- రాజకీయ విద్యా విధానాలను అభివృద్ధి చేయాలి
- ప్రజల్లో గ్రామవ్యవస్థ పట్ల ఉత్సాహాన్ని నింపాలి
- ముఖ్య కార్యనిర్వహణాధికారి కార్యాలయాన్ని నియంత్రించాలి.

SAKSHI

1919 చట్టం ప్రకారం స్థానిక సంస్థలు బదిలీ అంశంగా ఏర్పాటైంది. 1935 చట్టం స్థానిక సంస్థలను కొంతవరకు అభివృద్ధి చేసింది. రెండో ప్రపంచ యుద్ధం వల్ల స్థానిక సంస్థలు అభివృద్ధికి నోచుకోలేదు. బ్రిటిష్, రిటైర్డ్ ఆంగ్ల అధికారులైన హెన్రీ మెట్‌కాఫ్, హెన్రీ మైన్ వంటి వారు గ్రామ వ్యవస్థ ఏర్పాటుకు కృషిచేశారు. 1946లో టంగుటూరి ప్రకాశం పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు దగ్గరలోని గోపన్నపాలెంలో ఫిర్కా అభివృద్ధి పథకాన్ని ప్రవేశపెట్టారు.

స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగంలోని 40వ ప్రకరణలో.. ప్రతి గ్రామంలో పంచాయత్ వ్యవస్థను ఏర్పాటుచేయాలని పొందుపరిచారు. 246 ప్రకరణ ప్రకారం రాష్ట్ర శాసనసభలకు వీటిపై చట్టాన్ని తయారుచేసే అధికారమిచ్చారు. ఫోర్డ్ ఫౌండేషన్ (1948), సమాజ వికాస్ ప్రయోగం (1952), జాతీయ విస్తరణ సర్వీసు (1953)వంటి వివిధ కమిటీల ద్వారా గ్రామాభివృద్ధికి కార్యక్రమాలను చేపట్టారు.

## సమాజ్ వికాస్ ప్రయోగం (1952):

ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచటానికి, పేదరికాన్ని నిర్మూలించటానికి, సామాజిక పరిస్థితులను మెరుగుపరచటానికి, భారత ప్రభుత్వం మొదటి పంచవర్ష ప్రణాళికలో అంతర్భాగంగా సమాజ్ వికాస్ ప్రయోగాన్ని అక్టోబర్ 2, 1952న ఏర్పాటు చేసింది. గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయటం దీని ముఖ్యోద్దేశం.

**నిర్మాణం:** ఈ ప్రయోగంలో మానవ వనరుల పరస్పర సహకారం ద్వారా అభివృద్ధిని సాధించటానికి గ్రామాన్ని ప్రాతిపదికగా తీసుకున్నారు. కొన్ని గ్రామాలను కలిపి బ్లాకులుగా విభజించారు. దీనిని బట్టి మూడు స్థాయిల్లో-గ్రామ, బ్లాకు, జిల్లాలుగా అభివృద్ధి కార్యక్రమాల కోసం యంత్రాంగమే ర్పడింది. దేశంలో మొత్తం 5011 సమాజ్ వికాస్ బ్లాకులను ఏర్పరచారు. ప్రతి బ్లాకులోను సమాజ్ వికాస్ ప్రాజెక్టును చేపట్టారు.

బ్లాక్ నియంత్రణకు బ్లాకు డెవలప్‌మెంట్ అధికారిని నియమించారు. ఈ అధికారికి సాయపడటానికి వ్యవసాయం, పశుగణాభివృద్ధి, పరిశ్రమలు, సామాజిక విద్య, సహకారం, ప్రభుత్వ పనులకు విస్తరణాధికారులుంటారు.

**విధులు :**

- గ్రామాల్లో బావులను తవ్వించటం
- గ్రామాల్లో చిన్న చిన్న పరిశ్రమలను ఏర్పాటు చేయటం
- ప్రాథమిక పాఠశాలలను నిర్మించటం, నిర్వహించటం
- భూసార పరిరక్షణను పెంపొందించటం
- కుటుంబ సంక్షేమ కార్యక్రమాలను అభివృద్ధి చేయటం
- గ్రామంలో శ్రమదానాన్ని ఏర్పాటుచేసి అందరిని భాగస్వాములుగా చేయటం

ఈ ప్రయోగం సిటిజన్-పాలన కలయిక వల్ల అభివృద్ధికి నోచుకోలేదు. గ్రామస్థాయిలో అవినీతి పెరగటం, అధికార దుర్వినియోగం, రాజకీయ పార్టీల జోక్యం పెరగటం, ప్రజలు కార్యక్రమాల అమలుకు దూరంగా ఉండటం ఇందుకు ప్రధాన కారణాలు.

1953లో గ్రామ వ్యవస్థను అభివృద్ధి పరచాలనే ఉద్దేశంతో జాతీయ విస్తరణ పథకాన్ని ప్రవేశపెట్టారు.

## ప్రాక్టీస్ ప్రశ్నలు...

**1. గ్రామీణి అంటే?**
ఎ) ఎర్ర బస్సు  బి) పచ్చ బస్సు
సి) అధికారి  డి) అనధికారి

**2. ఏ కాలంలో గ్రామ వ్యవస్థ మరింతగా అభివృద్ధి చెందింది?**
ఎ) ఆధునిక యుగం  బి) మధ్యయుగం
సి) ప్రాచీన యుగం  డి) చేర కాలం

**3. మధ్యయుగంలో ఎవరి కాలంలో పంచాయత్ వ్యవస్థను పునరుద్ధరించారు?**
ఎ) మొగలుల కాలం  బి) ముస్లిం కాలం
సి) చోళుల కాలం  డి) మహారాష్ట్రుల కాలం

**4. స్థానిక ప్రభుత్వ పితామహుడు?**
ఎ) లార్డ్ కర్జన్  బి) లార్డ్ మేయో
సి) లార్డ్ రిప్పన్  డి) లార్డ్ కానింగ్

**5. స్థానిక స్వపరిపాలన పితామహుడుగా పేరొందిన వ్యక్తి?**
ఎ) లార్డ్ మేయో  బి) లార్డ్ రిప్పన్
సి) లార్డ్ కర్జన్  డి) లార్డ్ కానింగ్

**6. రాయల్ కమిషన్ అధ్యక్షుడు?**
ఎ) హెన్రీ మైనీ  బి) హెన్రీ మెట్‌కాఫ్
సి) హెన్రీ చార్లెస్  డి) చార్లెస్ హాబ్ హౌజ్

**7. ఏ చట్టం ప్రకారం 'స్థానిక సంస్థలు' బదిలీ అంశంగా ఏర్పాటైంది?**
ఎ) 1909 చట్టం  బి) 1919 చట్టం
సి) 1935 చట్టం  డి) 1892 చట్టం

**8. సమాజ్ వికాస్ ప్రయోగం ఎప్పుడు ప్రారంభమైంది?**
ఎ) 1953  బి) 1952
సి) 1948  డి) 1954

**9. వికేంద్రీకరణ పితామహుడు?**
ఎ) చార్లెస్ హాబ్ హౌజ్  బి)చార్లెస్ మెక్ కాఫ్
సి) చార్లెస్ జాన్  డి) చార్లెస్ జేమ్స్

| జవాబులు | 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | C | C | D | B | B | D | B | B | A |

SAKSHI